ప్రజాశక్తి
గురువారం 18 మే 2023
5
శ్రీ సత్యసాయి

నిర్మానుష్యం..!

భానుడి ధాటికి బయటకు రావాలంటే భయం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గత మూడు రోజులుగా భానుడి తన ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం 9 గంటలు దాటితే చాలు ఆరు బయట నిప్పులకొలిమిలా మారుతోంది. ఎండవేడిమికి వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం జనంతో రద్దీతో ఉండే పుట్టపర్తి ప్రధాన వీధులు సైతం మధ్యాహ్న సమయంలో జనం లేకబోసిపోతున్నాయి. 10 గంటలు దాటితే జనం బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఎండల దృష్ట్యా పుట్టపర్తి పట్టణంలో ఉదయం 11 గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 9 వరకు మాత్రమే దుకాణాలు, హోటళ్లను నడుపుతున్నారు. 11 గంటలు దాటితే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ వారు, 11 గంటల తర్వాత అత్యవసరమైతేనే తప్ప బయటకు వెళ్లొద్దని చెబుతున్నారు. ఒక వేళ వెళ్లినా తప్పనిసరిగా గొడుగు వాడాలని సూచిస్తున్నారు. దీనికి తోడు తరచూ విద్యుత్ అంతరాయంతో ఇళ్లలో జనం ఉక్కపోతకు గురవుతున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న పుట్టపర్తి ప్రశాంతి నిలయం రోడ్డు



పట్టుకు ప్రోత్సాహం కరువు

◆ రెండేళ్లుగా రైతుల ఎదురుచూపు
◆ రీలర్లకు అదేపరిస్థితి
◆ బకాయిల చెల్లింపులో జాప్యం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా సత్యసాయి జిల్లాలో మల్బరీ సాగుంది. పట్టు ఉత్పత్తి కూడా అధికమనే చెప్పాలి. అయితే ప్రభుత్వం పట్టు రైతులకు, పట్టు ద్వారా దారం తీసే రీలర్లకు అందివ్వాల్సిన ప్రోత్సహకాల్లో తీరని జాప్యం జరుగుతోంది. సత్యసాయి జిల్లా పరిధిలో 50,016 ఎకరాల్లో మల్బరీ సాగవుతుంది. మార్కెటింగ్ సౌకర్యం కూడా ఈ జిల్లా పరిధిలోనే అధికంగా ఉంటుంది.

ఎస్‌డిఎస్ కోసం పట్టు రైతుల ఎదురుచూపు

పట్టుగూళ్ల ఉత్పత్తి చేసి విక్రయించే సమయంలో ధర తక్కువగా ఉంటే కిలోకు రూ.50 చొప్పున రైతులకు ప్రోత్సహం కింద ప్రభుత్వం ఎస్‌డిఎష్ (రాష్ట్ర అభివృద్ధి నిధి) కింద అందజేయడం జరుగుతుంది. దీని కింద 2021-22 సంవత్సరంలో రూ.7.03 కోట్లు కావాల్సి ఉండగా ప్రభుత్వం రూ.1.77 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. ఇందులోనూ రూ.77.50 లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. తక్కిన కోటి రూపాయలు బ్యాంకు ఖాతాల్లోకి జమవలేదు. మంజూరవని మొత్తం పెండింగ్‌లోనే ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.1.70 కోట్లు కేటాయించింది. కాని నిధులు ఇప్పటికీ మంజూరవలేదు. రైతులు ఈ ప్రోత్సహం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.

రీలర్లకూ పెండింగే...

పట్టు రీలర్ల పరిస్థితి అదేలా ఉంది. పట్టు కోనుగోలు చేసిన రీలర్లకు ప్రోత్సహం ఎస్‌డిఎస్ కింద మంజూరు చేస్తారు. కాని రెండేళ్లుగా వీరి పరిస్థితి అదే తీరున ఉంటోంది. 2021-22 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.1.65 కోట్లు ప్రోత్సహకం కింద మంజూరవ్వాల్సి ఉంది. ఇందులో రూ.1.54 కోట్లు మంజూరు చేసినప్పటికీ రీలర్ల ఖాతాలకు జమైంది మాత్రం రూ.36 లక్షలు మాత్రమే. ఇంకా రూ.1.18 కోట్లు జమవ్వాల్సి ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి రూ.1.85 కోట్లు మంజూరవ్వాల్సి ఉంది. కాని ఇప్పటి వరకు ఒక్క రూపాయి జమవలేదు. వీటి కోసం రీలర్లు ఎదురు చూస్తూనే ఉన్నారు.

నాలుగేళ్లుగా బకాయిలున్నాయి
వెంకటరామిరెడ్డి, ఎపి పట్టు రైతు సంఘం రాష్ట్ర నాయకులు.

రాష్ట్ర వ్యాప్తంగా నాలుగేళ్లుగా పట్టు రైతులు, రీలర్లకు అందాల్సిన ప్రోత్సహకాలు అందలేదు. సుమారు రూ.50 కోట్ల వరకు బకాయిలున్నాయి. వీటిని చెల్లించాలని అనేక మార్లు ప్రభుత్వానికి విన్నవించాం. ఇటీవల ప్రభుత్వ సలహాదారు సజ్జలరామకృష్ణారెడ్డిని కూడా పట్టు రైతులు కలసి సమస్యను విన్నవించారు. బకాయిలను చెల్లిస్తామని ఆయన హామీనిచ్చారు. ఇంకా మంజూరవలేదు. ఇప్పటికైనా బకాయిలను విడుదల చేయాలి. అదే సమయంలో ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ చేపడతామని చెబుతోంది. అందులో భాగంగా పట్టు పరిశ్రమ శాఖ కమిషనరేట్‌ను హిందూపురంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. మల్బరీసాగు సత్యసాయి, మదనపల్లి ప్రాంతాల్లోనే అదికంగా ఉంది. ఈ ప్రాంతానికి అనువుగా ఇక్కడ ఏర్పాటు చేస్తే పట్టు రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

పట్టు సాగు పరిశీలన

కదిరి రూరల్ : పట్టు పంట సాగును కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం పలు మండలాల్లో పరిశీలించారు. నల్లమడ, నల్లచెరువు, కదిరి మండలాల్లో పర్యటించారు. నల్లమాడ మండల కేంద్రం సమీపంలో రైతు జయరామిరెడ్డికి చెందిన చౌకీ పెంపకం కేంద్రం, మూర్తిపల్లిలో రైతు ఎం.చౌదరికి చెందిన మల్బరీ తోట, నల్లచెరువు మండలంలో రైతులు శంకర రెడ్డి, కృష్ణారెడ్డికి చెందిన మల్బరీ తోటలను కలెక్టర్ పరిశీలించారు. నల్లమడ మండలంలో పట్టు పరిశ్రమ పంటలో మంచి ఫలితాలు సాధించిన ఆదర్శ రైతు జయరామిరెడ్డికి చెందిన పట్టు పంట, పురుగుల కేంద్రాన్ని పరిశీలించారు. పట్టు సాగుకు సంబంధించిన పలు విషయాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. పట్టుకు ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ రైతులకు తెలియజేశారు.

పట్టుగూళ్లను పరిశీలిస్తున్న సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

సజావుగా ఈఏపీసెట్ పరీక్షలు

50,399 మంది హాజరు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈఏపీసెట్-2023 పరీక్షలు బుధవారం మూడవ రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 49,036 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 46,832 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 95.51 శాతం హాజరు నమోదు అయ్యింది. తెలంగాణలో 4,321 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,567 మంది విద్యార్థులు హాజరయ్యారు. 82.55 శాతం హాజరు నమోదు అయ్యింది. రెండు రాష్ట్రాల్లో కలిపి 53,357 మందికి గాను 50,399 మంది హాజరవగా 94.46 శాతం హాజరు నమోదు అయ్యింది. ఈఏపీసెట్ ఛైర్మెన్ జి.రంగ జనార్ధన అనంతపురం సమీపంలోని ఆలమూరు రోడ్డు పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రంగజనార్ధన

కలెక్టరేట్ ముట్టడి కరపత్రాలతో ఉపాధి కూలీలు, నాయకులు

విరివిగా ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి రొద్దం

కూలీలకు అనుకూలమైన ఉపాధి పనులను విరివిగా కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు బుధవారం మండలంలోని కోగిరా, కంబాలపల్లి, శాపురం, భీదానుపల్లి, గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని 63గ్రామాలలో ఎక్కువ మంది ఉపాధిపనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని నీరు కార్చే పనిలో ఉందని దీంతో కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వేసవి అలవెన్సులు కల్పించాలని, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో ఉపాధి కూలీలకు నిధులు సక్రమంగా చెల్లించాలన్నారు. ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఈనెల 22న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడికిఉపాధి కూలీలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధికారి నారాయణ, ఉపాధి కూలీలు శ్రీరాములు, రామన్న, శకుంతల, పుల్లమ్మ, రంగయ్య, కోనప్ప, తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మండలమీట్

ఫారెస్ట్ అధికారి అవినీతిపై సభ్యులు నిలదీత

ప్రజాశక్తి-కనగానపల్లి

ఎంపిపి కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. ఎక్కువగా రెవెన్యూ సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీటికి సమాధానం చెప్పాల్సిన తహశీల్దార్ సమావేశానికి రాకపోవటంతో ప్రజాప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అలాగే అటవీశాఖకు సంబంధించి కుర్లపల్లి, కుర్లపల్లి తండా గ్రామాల సమీపంలో ఫారెస్ట్ అధికారి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కొంతమంది తన మనుషులను ఫారెస్ట్ ఇన్‌ఛార్జులుగా నియమించి ఇష్టానుసారంగా ప్రభుత్వ సొమ్ము లక్షల రూపాయలను స్వాహా చేస్తున్నారని విమర్శించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఫారెస్ట్ అధికారి గౌతమిపై చర్యలు తీసుకోవాలని సర్పంచులు మురళి, విజయ్, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఫారెస్ట్ లో వర్కులకుసంబంధించి ఎంత డబ్బును వినియోగించారని ని ప్రజా ప్రతినిధులు అడగగా ఆమె సమాధానం ఇవ్వలేకపోయింది. దీంతో ఫారెస్ట్ అధికారి అక్రమాలకు పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు

ఫలించిన చేనేత కార్మికసంఘం పోరాటం

◆ పిన్నెపల్లి బాధితులకు న్యాయం ◆ కోర్టు ఆదేశాలతో చేనేతలకు రూ.17.95 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చేనేత కార్మికుల కోసం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన న్యాయపోరాటం ఫలించింది. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలంటూ న్యాయసేవామండలి కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఆ కుటుంబాలకు రూ.17.95 లక్షల పరిహారం అందనుంది. 2019వ సంవత్సరంలో యాడికి మండలంలోని పిన్నెపల్లి చెరువు కట్ట తెగి యాడికి గ్రామంలో పలు కాలనీలు నీట మునిగాయి. ఇందులో దాదాపు 359 చేనేత కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. నష్టపోయిన చేనేత కుటుంబాలకు న్యాయం చేయాలని చేనేత కార్మిక సంఘం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని తీర్పు వెలువరించింది. ఈ మేరకు రూ.17,95,000 పరిహారం అందనుంది. ఇందుకు సంబంధించి బుధవారం నాడు ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు యాడికి కోన రోడ్డు చౌడేశ్వరిదేవి దేవాలయంలో చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాడికి మండలంలోని పిన్నెపల్లి చెరువు యాడికి మండలానికి పైభాగన ఉందన్నారు. 23-09.-2019న కురిసిన భారీ వర్షాల వల్ల పిన్నెపల్లి చెరువు కట్ట పూర్తిగా తెగి చెరువు నీరు యాడికి గ్రామంలోని చౌడేశ్వరి కాలనీ, హాస్పెటల్ కాలనీ, చెన్నకేశవ కాలనీలు మొత్తం నీటితో మునిగిపోయాయని తెలిపారు. ఈ కాలనీల్లో సుమారు 500 మంది పైబడి చేనేత కుటుంబాలు నివాస్తున్నాయని చెప్పారు. ముంపునకు గురై చేనేత కార్మికులు పట్టుచీరలు, ముడిసరుకులు భారీగా నష్టపోయారని తెలిపారు. ఇవేకాలనీలు 28-09-2019న మరోసారి ముంపునకు గురయ్యాయని చెప్పారు. అప్పట్లో జిల్లా కలెక్టర్, రాష్ట్ర మంత్రి, జిల్లా ప్రతినిధులు, హ్యాండ్‌లూమ్ అధికారులు సందర్శించి నష్టపరిహారం ఒక్కొక్కరికి రూ.5 వేలు మాత్రమే నిర్ణయించారని తెలిపారు. ఈ ఐదువేల రూపాయలు కూడా కార్మికులకు అందలేదన్నారు. లక్షల్లో నష్టం జరిగితే రూ.5వేలు ఇవ్వడం సరికాదని అప్పట్లో చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. బాధితుల న్యాయం చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాలుగు సార్లు ఆందోళనలు నిర్వహించామన్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో చేనేత కార్మిక సంఘం తరుపున తాను న్యాయసేవా మండలి కోర్టులో 03-11-2021వ తేదీన పిటిషన్ వేశానని చెప్పారు. దీనిపై విచారణ అనంతరం ఈ నెల 11వ తేదీన కోర్టు తీర్పు వెలువరించిందన్నారు. ఈ తీర్పు మేరకు హ్యాండ్‌లూమ్ కమిషనర్ 23 జీవోను విడుదల చేశారన్నారు. ఈ జీవో మేరకు 359 చేనేత కుటుంబాలకు రూ.17,95,000 విడుదల చేశారని తెలిపారు. నష్టపరిహారం విడుదలపై చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం కృషి చేసిన చేనేత కార్మిక సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాయకుంట్ల మోహన్, జిల్లా అధ్యక్షుడు బషీర్ అహమ్మద్, సహాయ కార్యదర్శి కాశెట్టి శ్రీనివాసులు, మండల సీనియర్ నాయకులు సంజీవులు, పెద్దకోట్ల శ్రీనివాసులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పోలా రామాంజినేయులు

వేగవంతంగా 'నాడు-నేడు' పనులు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే నాడు-నేడు పథకం కింద పురపాలక సంఘ వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో చేపట్టిను పనులను పూర్తి చేయడంతో పాటు, గృహ నిర్మాణ పనులను సైతం అనుకున్న గడువులోగా పూర్తి చేయాలని అమ్యూనిటి సెక్రెటరీలకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో గృహ నిర్మాణం, నాడు-నేడు పనులను, ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా వసూలు చేస్తున్న యూజర్స్‌పై సచివాలయ సెక్రెటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతు నాడు-నేడు పనులు అలస్యం చేయకుండా త్వరతగితిన పూర్తి చేయాలన్నారు. పురపాలక సంఘంలో కొట్నూరు, కొటిపి లే అవుట్‌లలో నిర్మాణం చేస్తున్న గృహ నిర్మాణాలను వేగ వంతంగా పూర్తి అయ్యే విధంగా చూడాలన్నారు. దీనిపై ప్రతి వారం మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి, ఎప్పటికప్పుడు పనులను సైతం పరిశీలన చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్లాప్ కార్యక్రమంలో వసూలు చేయాల్సిన యూజర్స్ ప్రతి ఇంటి నుంచి వసూలు చేయాలన్నారు. ఈ విధులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సెక్రెటరీలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఇఇ నీరజ, హౌసింగ్ డిఇఇ శివకుమార్ నాయక్, మున్సిపల్ ఎసిపి ఆనంద్ కుమార్, ఆర్‌ఐ రామాంజి, మేనేజర్ సుధాకర్, ఇతరఅధికారులు, సచివాలయ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాల పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలో చేపట్టిన వివిధఅభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, పురోగతి, ప్రజా సమస్యలు తదితర అంశాలపై మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ సమీక్ష నిర్వహించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మండల ప్రత్యేక అధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు, నాడు నేడు అభివృద్ధి పనులు, పక్కగృహాలు, ఐసిడిఎస్ ద్వారా లబ్దిదారులకు పౌష్టికాహారం, తాగునీటి సమస్యలు, ఖరీఫ్ లో విత్తన వేరుశనగ పంపిణీ తదితర అంశాలపై సమీక్ష సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీదేవి, తహశీల్దార్ యుగేశ్వరీదేవి, పిఆర్ ఇంజనీర్ రమణయ్య, ఎంఇఒ చాముండేశ్వరి,వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ వరలక్ష్మి, ఎపిఎం సుదర్శన్ రాజు, హౌసింగ్ ఇంజనీర్, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్

గ్రామసభలో మాట్లాడుతున్న జెసి

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సాధించినట్లు జాయింట్ కలెక్టర్ టిఎస్. చేతన్ పేర్కొన్నారు బుధవారం మండలంలోని తంగేకుంట గ్రామంలో సోత్రీయం భూములు రైతు వారి పట్టాల సంబంధించి గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 180 దరఖాస్తుల్లో 50అప్రూవల్ అయ్యాయని చెప్పారు. మిగిలిన కూడా త్వరలో అప్లోడ్ చేసి పట్టాలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా ఎవరైనా రైతులు రైతు వారి పట్టాల కోసం దరఖాస్తు చేసుకోకపోతే వెంటనే చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్, ఆర్‌ఐ నాగేంద్ర, సర్పంచి అబీద, వీఆర్వో సుధాకర్, రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తెద్దాం

ప్రజాశక్తి ధర్మవరంటౌన్

సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడొచ్చిన ధర్మవరంలో పసుపు జెండా ఎగురవేసిలా ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని టీడీపీ రాష్ట్రకార్యదర్శి కమతం కాటమయ్య పిలుపు నిచ్చారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు 29,30 వార్డు ముఖ్యనాయకులతో బుధవారం సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డులలో 101 పోలింగ్ బూత్ సెక్షన్ ఇన్‌ఛార్జి నియామకం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటుచేశామన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అంతతేకాకుండా పార్టీ పటిష్టత కోసం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. వార్డులోని ప్రధాన సమస్యలను ఆరాతీశారు. కష్టపడే వారికే పార్టీలో మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పణికుమార్, పురుషోత్తం గౌడ్, పరిశేసుధాకర్, నాగూరుస్సేన్, కొత్తపేటఆది, కేశగాళ్ల శ్రీనివాసులు, అత్తర్ రహీంబాషా, గోపాల్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - రొళ్ల

రొళ్ల గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శాఖ గ్రంథాలయంలో నిర్వహించే ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులు పాల్గొని తమలోని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి శ్రీ వెంకటరమణ కోరారు. గ్రంథాలయంలో పిల్లలకు చదువుకోవడానికి కావలసిన పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపును జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

మడకశిర రూరల్ : మడకశిర పట్టణంలోని ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఇఒ భాస్కర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు వ్యతిరేకిస్తూ ముందస్తుగా ప్రైవేటు విద్యాసంస్థలు ప్రచారం చేస్తూ అడ్మిషన్లు ప్రారంభించాయని విమర్శించారు. వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని మల్లాపల్లి పంచాయతీ, కళిగేరి గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త రామప్ప సతీమణి శివమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న పెనుగొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్ రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సర్పంచి శివానంద, పాటూరు లక్ష్మిరెడ్డి, బుల్లెట్ బాబు, డీలర్ మల్లి, మండల సచివాలయ కన్వీనర్ సమర సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

పుట్టపర్తి రూరల్: ప్రతి ఒక్కరూ చెట్లను కాపాడి పర్యావరణాన్ని పరిరక్షించాలని పర్యావరణ వేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉష్ణోగ్రతలు పెరిగి విలువ కట్టలేని నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుందన్నారు. .ఆంధ్రప్రదేశ్ భూమి నీరు వృక్షముల చట్టం 2002 ప్రకారం సెక్షన్ 28 సబ్ సెక్షన్ 5 ప్రకారం అనుమతి లేనిదే చెట్టు కొమ్మ కూడా నరకరాదని అన్నారు. దేశంలో రెండవ కరువు జిల్లా ఉమ్మడి అనంతపురం అని అన్నారు. జిల్లాలో అత్యంత కరువు ప్రాంతమైన గోరంట్ల మండలంలో ఏకంగా చెట్లను నరికి యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నా ఏమాత్రం చర్యలు తీసుకోవటం లేదని విమర్శించారు. ఇప్పటికైన అధికారులు స్పందించాలని ఆయన కోరారు.

రైతుసంఘం మండల కమిటీ ఏర్పాటు

రామగిరి : మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎపి రైతు సంఘం మండల కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులుగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా చింతకాయల ముత్యాలప్పను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి రమణ, గౌరవాధ్యక్షులు బి.మహాదేవ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. రెండు సంవత్సరాలుగా ఇన్‌పుట్ సబ్సిడీ, వాతావరణ బీమా ఇవ్వడంలోనిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో పోలేపల్లి గ్రామంలోహంద్రీనీవా ద్వారా రైతులకు సాగునీరు అందించాలని తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బాలరాజు, సహాయ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

కొత్తచెరువు : కొత్తచెరువులో జరుగుతున్న నాడు నేడు పనులను ఎంపీడీవో సిద్ధారెడ్డి బుధవారం పరిశీలించారు కమ్మ పాలెం ప్రాథమిక పాఠశాల బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు, హెచ్‌ఎంకు సూచించారు. అలాగే ఉర్దూ పాఠశాల సమీపంలో చేపట్టిన అంగనవాడీ కేంద్రం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

రాయలసీమ సమస్యలను పరిష్కరించాలి

ధర్మవరం టౌన్ : రాయలసీమ స్టీరింగ్ కమిటి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పిలుపు మేరకు రాయలసీమ ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిక్కిలి మహేశ్ ఆధ్వర్యంలో యువతను చైతన్యం చేస్తూ బుధవారం ధర్మవరం నియోజకవర్గంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమకు జరుగుతున్న అన్యాయాల గురించి ప్రజలకు వివరిస్తున్నామన్నారు. గత 10సంవత్సరాలుగా రాయలసీమ హక్కుల కోసం రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పనిచేస్తున్నామన్నారు. రాయలసీమ సమస్యలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకపోతే 2024 ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఎంపిడిఒ కార్యాలయ భవనం ప్రారంభం

నల్లచెరువు : రూ. 16.50 లక్షలతో మరమ్మతులు చేపట్టిన ఎంపిడిఒ కార్యాలయ భవనాన్ని కదిరి శాసన సభ్యులు డాక్టర్ పి వి సిద్దారెడ్డి బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లచెరువు మండల ఎంపీడీవో కార్యాలయం ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయడంతో ప్రజలకు, అధికారులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, ఎంపిడిఒ శకుంతల, కార్యాలయ సిబ్బంది, వైస్ ఎంపిపి నారాయణ స్వామి, సింగిల్ విండో చైర్మన్ జయ చంద్రారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారానికి విరాళం

కదిరి టౌన్ : వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వాల్మీకి ప్రతిభా పురస్కార కార్యక్రమ నిర్వహణ కోసం కదిరి పట్టణానికి చెందిన టిడిపి నాయకులు బంగారు కృష్ణమూర్తి తన వంతుగా విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన రూ. 5116లను అందజేశారు. ఈసందర్భంగా బంగారు కృష్ణమూర్తి మాట్లాడుతూ వాల్మీకి బోయ కులంలో పదో తరగతి ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ప్రోత్సహించే విధంగా వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేయడం హర్షించదగ్గ విషయం అన్నారు.

ప్రోత్సాహక బహుమతులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం టౌన్ : పదవతరగతి పాసైన వాల్మీకి సామాజికవర్గానికి చెందిన విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులకోసం ఈనెల 23వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వాల్మీకి ఉద్యోగసంఘం నాయకులు ఈశ్వరప్ప, ముత్యాలప్ప, నరసింహులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదవ తరగతి ఫలితాలలో 500 మార్కులకు పైగా తెచ్చుకున్న విద్యార్థులకు ఈనెల 27వతేదీ ధర్మవరంలో ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9394798674, 9490123842 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కురుబ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా ముత్యాలు

కనగానపల్లి : రాప్తాడు నియోజకవర్గ కురుబ యువజన సంఘం అధ్యక్షులుగా మండల పరిధిలోని తల్లి మడుగు గ్రామానికి చెంది బిల్లే ముత్యాలును నియమించినట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షులు పామాల రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షులు వశికేరి రమేష్ ఆదేశాల మేరకు బిల్లే ముత్యాలను నియమించినట్లు చెప్పారు. ఈసందర్భంగా బిల్లే ముత్యాలును నాయకులు వీరనారప్ప తదితరులు అభినందించారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

వక్ఫ్ భూముల పరిశీలన

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి పట్టణం కుటా గుళ్ల ఈద్గాహ్, ఖబరిస్తాన్, దర్గాలకు చెందిన భూముల ఆక్రమణకు గురి కావడంతో ఆ భూములను అధికారులు బుధవారం పరిశీలించారు. కదిరి ముస్లిం జెఎసి, కదిరి ముతవల్లిల కమిటి, దర్గాహ్ పీఠాధిపతి, ఆర్‌సిపి జిల్లా కమిటీ, వైసిపి పట్టణ అధ్యక్షుడు, వెల్డింగ్ వర్కర్స్ యూనియన్, రాయలసీమ ఇమామ్, మౌజన్ కమిటీ తదితరులు వక్ఫ్ ఆస్తులపై జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సిఇఒకు, మైనారిటీ సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా వక్ఫ్ బోర్డు అధికారులు విచారణ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముతువల్లిల డివిజన్ కమిటీ అధ్యక్షుడు, ముస్లిం జెఎసి కన్వీనర్ టిఎండి ఇలియాజ్,దర్గాహ్ పీఠాధిపతి సయ్యద్ ఉబెదుల్లా హుసేని ,రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ సత్యసాయి జిల్లా కార్యదర్శి నాగన్న, వైసిపి పట్టణ అధ్యక్షుడు బాహుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన వక్ఫ్ భూములను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయమనిఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం గోరంట్ల మండల పరిధిలోనీ బూదిలి వాండ్లపల్లి, జక్కసముద్రం గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా కొన్నిటిని అక్కడికక్కడే పరిష్కరించి మరికొన్నింటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసింహ, సింగల్ విండో అధ్యక్షులు బయపరెడ్డి,సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరు శంకర్ రెడ్డి, ఎంపిపి ప్రమీల మూర్తితో పాటు నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు 'జగనన్న ఆర్థికసాయం'

ఆమడగూరు : ఆంధ్రప్రదేశ్ నుండి హజ్ యాత్ర చేస్తున్న వారికి జగనన్న ఆర్థికసాయం అందజేస్తున్నట్లు వైఎస్ఆర్ కదిరి పట్టణ అధ్యక్షుడు బహుద్దిన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం, విజయవాడ ఎంబార్కెషన్ పాయింట్ నుండి బయలుదేరే 1813 మంది యాత్రికులకు, విమాన టికెట్టు పై,ప్రతి యాత్రికునిపై రూ.80వేలు అదనపు భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారన్నారు. దీంతో సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ, మైనారిటీ వ్యవహారాల శాఖా మాత్యులతో సంప్రదింపులు జరిపి, హైదరాబాద్ మరియు బెంగళూరు ఎంబార్కెషన్ పాయింట్ల టికెట్ ధరలతో సమానంగా విజయవాడ ఎంబార్కెషన్ పాయింట్‌కు టికెట్ ధర నిర్ణయించాలని కోరినట్లు చెప్పారు. అయితే సాంకేతిక కారణాల వలన ఆయా మంత్రిత్వ శాఖలు తమ నిస్సహాయతను ప్రకటించిన విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. దీంతో ఆయన వెంటనే స్పందించి ఆ అదనపు భారం ఎంతైనా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, ఎట్టి పరిస్థితులలో కూడా యాత్రికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చినట్లు చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో ఆర్‌టి నెంబర్ 114, మైనార్టీస్ వెల్ఫేర్ (ఒపి బడ్జెట్) డిపార్ట్మెంట్) ప్రకారం రూ. 14.51 కోట్లు ఆర్థిక సహాయం విడుదల చేసినట్లు బాహుద్దీన్ తెలిపారు. జగన్ మరొక్క సారి తాను ముస్లిం మైనార్టీల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. ఈ మొత్తాన్ని గన్నవరం విజయవాడ ఎంబార్కెషన్ పాయింట్ నుండి హజ్ యాత్రకు బయలుదేరు 1813 మంది యాత్రికులకు సంబంధించి, సెంట్రల్ హజ్ కమిటీ ఆఫ్ ఇండియాకు వారు చెల్లించాల్సిన మిగతా మొత్తాన్ని ఆన్ లైన్ ద్వారా సెంట్రల్ హజ్ కమిటీకి బుధవారం చెల్లించారని వైసిపి కదిరి పట్టణ అధ్యక్షులు కె ఎస్ బహవుద్దీన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ ఎం ఎన్ ఫయాజ్ అలీ ఖాన్, న్యాయవాది అబ్దుల్ రహిమాన్, వైసిపి నాయకులు ఎన్ ఖితాబుద్దిన్, మౌలా, బాబ్జాన్, బషీర్, జీలాన్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్ర వ్యాప్తంగా పవిత్ర హజ్ యాత్ర చేస్తున్న హజ్ యాత్రికులకు జగనన్న ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, మరో సారి ముస్లీం మైనార్టీల పక్షపాతి అని నిరుపించుకున్నారని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం వార్డు పర్యటనలో ఆయన మాట్లాడుతు ఆంధ్రప్రదేశ్ నుండి పవిత్ర హజ్ యాత్ర చేస్తున్న, ప్రత్యేకించి గన్నవరం, విజయవాడ ఎంబార్కెషన్ పాయింట్ నుండి బయలుదేరుతున్న 1813 మంది యాత్రికులకు, విమాన టికెట్టు పై, ప్రతి యాత్రికునిపై రూ.80,000 అదనపు భారం పడుతుండగా ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించడానికి అంగీకరించిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.14.51 కోట్లు ఆర్థిక సహాయం విడుదల చేసి, మరొక్క సారి తాను ముస్లిం మైనార్టీల పక్షపాతి అని నిరూపించుకున్నారు. ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

ఖాద్రీశుడిని దర్శించుకున్న చిత్తూరు ఏసీబీ ఏఎస్పీ

ప్రజాశక్తి అమడగూరు

పట్టణంలోని ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని ఏసీబీ ఏఎస్పీ శ్రీలక్ష్మికి బుధవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు, పాలకమండలి చైర్మన్ జరిపిటి గోపాలకృష్ణ ఆమెకు స్వాగతం పలికారు. లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీలక్ష్మి గతంలో కదిరి డీఎస్పీగా విధులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జెరిపిటి గోపాలకష్ణ, పాలకమండలి సభ్యులు, ప్రధాన అర్చకులు ఆమెకు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

నిర్మాణాల మేరకే పన్నుల వసూలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా నిర్మాణాల మేరకే ఇంటి పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఆర్‌టిసి కాలనీ, తదితర ప్రాంతాల్లో ఇంటి పన్నులు ఎక్కువ వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఆయా ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నిర్మాణాల మేరకే పన్నులు విధించాలని, ఎక్కువ తక్కువ విధిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలన చేస్తున్న కమిషనర్

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు హిందూపురం క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన చెస్ క్రీడాకారులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు హిందూపురం క్రీడాకారులు ఎంపికయ్యారు. బుధవారం పట్టణంలోని స్పార్టాన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించి పలువురిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగార్జున, కర్నాటక టోర్నమెంట్ డైరెక్టర్ అరిఫుల్లా మాట్లాడుతు రాష్ట్ర స్థాయి పోటీల కోసం జిల్లా నుంచి చెస్ క్రీడా కారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లా సీనియర్ ఓపెన్, ఉమెన్ చెస్ చాంపియన్షిప్ -2023 పోటీల్లో మొత్తం ఐదు రౌండ్ల పోటీలు నిర్వహించామన్నారు. సీనియర్ ఓపెన్ విభాగంలో 4.5/5 పాయింట్లు సాధించి అఫ్రిద్ టి ఖాన్ ఛాంపియన్ గా నిలిచారన్నారు. జ్ఞాపికా రెడ్డి 4/5 పాయింట్లతో ద్వితీయ స్థానం, కార్తికేయ 4/5 పాయింట్లు తృతీయ స్థానం, జైక్రిష్ణ 3.5/5 పాయింట్లు నాల్గవ స్థానం సాధించారన్నారు. మహిళా విభాగంలో 4/5 పాయింట్లు సాధించి జ్ఞాపికా రెడ్డి ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. 3/5 పాయింట్లతో పూర్ణమ్మ ద్వితీయ స్థానం, మధుశ్రీ 2/5 పాయింట్లతో తృతీయ స్థానం, 2/5 పాయింట్లు సాధించిన వెంకట సాయి, సహస్ర నాల్గవ స్థానం సాధించారన్నారు. మహిళా విభాగంలో ఎంపికైన నలుగురు క్రీడాకారిణులు విజయవాడలో 18వ తేదీ నుండి 21వ తేదీ వరకు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి మహిళా ఫిడే రేటింగ్ చెస్ ఛాంపియన్షిప్-2023 పోటీల్లో పాల్గొంటారన్నారు. ఓపెన్ విభాగంలో ఎంపికైన నలుగురు క్రీడాకారులు తిరుపతిలో ఈనెల 26 నుంచి 29 వరకు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సీనియర్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ ఛాంపియన్షిప్-2023 పోటీల్లో శ్రీ సత్యసాయి జిల్లా తరపున ప్రాతినిత్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జున, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉదయ్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ, తదితరులు

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి రూరల్: రోజురోజుకు పెట్రేగిపోతున్న అసాంఘిక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి సూచించారు. 16వ తేదీ అర్ధరాత్రిన ముదిగుబ్బ రైల్వే గేట్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడ్డ నకిలీ బంగారం, నకిలీ నోట్లను కార్యాలయంలో విలేకరుల ఎదుట ప్రదర్శించారు. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామానికి చెందిన బుక్కే గోవింద నాయక్ ముదిగుబ్బ రైల్వే గేట్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడ్డాడని అతన్ని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరచి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. నిందితుడి వద్ద నుంచి రూ.21 లక్షల నకిలీ 500 రూపాయల 42 కట్టలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అంతేకాకుండా 185 గ్రాముల నకిలీ బంగారు చైనులు, 102 గ్రాముల బంగారు బిస్కెట్లు, ఒరిజినల్ ఐదు వందల నోట్లు నాలుగు, 50 గ్రాములు ఒరిజినల్ బంగారు బిస్కెట్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితునికి గతంలో పలు కేసులు ఉన్నాయని చెప్పారు. కదిరి రూరల్ ప్రొద్దుటూరు తనకల్లు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. ఇలాంటి వారి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను మభ్య పెట్టడానికి ఎలాంటి ప్రయత్నాలు చేసినా వారి ఉచ్చులోకి పడరాదని సూచించారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

లేపాక్షి : లేపాక్షి గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి పురుషోత్తం కుమారుడు ఇంటర్ చదువుతున్న కార్తీక్ అనే యువకుడి అదృశ్యంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్తీక్ స్థానిక మహాత్మా జ్యోతిభాపులే గురుకుల కళాశాలలో చదువుతు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలను మార్చి నెలలో రాశాడు. ఇటీవల విడుదల అయిన పరీక్ష ఫలితాలలో తప్పినందున తల్లిదండ్రులు మండలించడం ఈనెల 13వ తేదీన శనివారం ఉదయం 10.30గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులను విచారించారు. ఫలితం లేకపోవటంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కార్తీక్ తండ్రి పురుషోత్తం తెలిపారు. కార్తీక్ ఆచూకీ తెలిసిన వారు పురుషోత్తం ఫోన్ నంబర్ 9505326876కుగాని, లేపాక్షి పోలీసు స్టేషన్‌కు గాని సమాచారం ఇవ్వాలని ఎస్ఐ మునీర్ అహమ్మద్ కోరారు.

అన్నమయ్య జిల్లాలో రోడ్డు ప్రమాదం కదిరి వాసి మృతి

కదిరి టౌన్ : అన్నమయ్య జిల్లా అంగళ్లు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సత్యసాయి జిల్లావాసి మృతిచెందాడు. ఘటనకు సంబంధించిన వివరాలు..కదిరి పట్టణానికి చెందిన ఫ్రూట్ మర్చంట్ నిజాం తన మిత్రులతో కలిసి మంగళవారం రాత్రి కారులో చెన్నై ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. అంగళ్లు సమీపంలోని మలుపు వద్ద నెల్లూరు జిల్లా గూడూరు నుండి వస్తున్న కూరగాయల మినీ లారీ వారు ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో నిజాం ఘటనా స్థలంలోనే మృతిచెందాడు.కారు డ్రైవర్ ఫిర్దోస్ అతనితోపాటు ఇనాయతుల్లా ఇమ్రాన్ తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

గడ్డివామి దగ్ధం

ఓబుల దేవర చెరువు : మండలంలోని అల్లా పల్లి పంచాయతీ పగడాల వారి పల్లిలో జరిగిన అగ్నిప్రమాదంలో పూజారి రమణప్పకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టారని బాధితుడు వాపోయాడు. 3 ట్రాక్టర్లు గడ్డి కాలిబూడిద అయిందన్నారు. దీంతో తనకు 35వేల రూపాయలు నష్టం వాటిల్లిందని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కోరారు.

ఉద్యమకారులపై కేసులు కొట్టివేత

పుట్టపర్తి రూరల్ : ఉద్యమ కారులపై పెట్టిన కేసులను పుట్టపర్తి సివిల్ జిల్లా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేస్ కోర్టులో కొట్టి వేసినట్లు వేసినట్లు నాయకులు తెలిపారు. ట్రాన్స్‌పోర్టు యూనియన్ రాష్ట్ర కేంద్ర కమిటీ పిలుపుమేరకు 2017 ఏడో తేదీ ఏడో నెల ఆటో డ్రైవర్లు తమ న్యాయమైన డిమాండ్ల కోసం చేపట్టిన నిరసన సందర్భంగా అప్పటి ప్రభుత్వంలో వీరిపై కేసులు బనాయించారన్నారు. పదిమంది ఆటో డ్రైవర్లు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ట్రాన్స్‌పోర్టు యూనియన్ జిల్లా కార్యదర్శి బాబా, నాయకులు కుల్లాయప్ప అప్పటి సిఐటియు మండల కార్యదర్శి గౌస్‌లాజం, సిపిఎం మండల నాయకుడు రాము ,ఆటో డ్రైవర్లు రఫీ మాబు , జాఫర్, అలీ పై కేసులు నమోదు చేశారు. ఆరు సంవత్సరాల తర్వాత జిల్లా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారించి బుధవారం కొట్టి వేసినట్లు వారు తెలిపారు. దాంతో అంతిమ విజయం కార్మికులకే లభించిందని వారు హర్షం వ్యక్తం చేశారు.

విరివిగా ఉపాధి పనులు

కొత్తచెరువు : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సిద్ధారెడ్డి తెలిపారు మండల పరిధిలోని కోడపగానిపల్లి సమీపంలోనే పొలాల్లో చేపట్టిన పనులను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం అయినందున ఉదయాన్నే పనులకు వచ్చి పది గంటలకు ముగించుకొని వెళ్లాలన్నారు మండల వ్యాప్తంగా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి పనులను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఎపిఒ నాగిరెడ్డి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

నేటి నుంచి సబ్సిడీ విత్తన వేరుశనగ నమోదు

స్టాకు వివరాలు పరిశీలిస్తున్న అధికారి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేయనున్న వేరుశెనగ విత్తన కాయల కోసం రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29 నుంచి ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రాయితీపై రైతులకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వేరుశనగ విత్తన కాయలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కె 6 రకం తో పాటు కె 1812 (లేపాక్షి) విత్తనాలు సరఫరా చేస్తామన్నారు. కె 6 రకం 30 కేజీల బస్తా ధర 2790 ఉండగా సబ్సిడీ రూ. 1116 పోగా రూ. 1674లు రైతు భరించాల్సి ఉంటుందన్నారు. కె 1812 రకం 30 కేజీల బస్తా ధర రూ. 2490 ఉండగా సబ్సిడీ పోను రూ. 1494 రూపాయలు రైతు భరించాల్సి ఉంటుందన్నారు. అర ఎకరం ఉంటే ఒక 30 కేజీల బస్తా, ఎకరా ఉన్నవారికి 2 బస్తాలు, ఎకరం పైన ఎంత ఉన్న మూడు బస్తాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో జిల్లాలో 1,00,907 క్వింటాళ్ళ పంపిణీ చేయాలని లక్ష్యం కాగా, ఇప్పటికే 2400 క్వింటాళ్ల వేరుశనగ కాయలు ఆర్‌బికెలకు చేరాయన్నారు.

నల్లచెరువు : మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఖరీఫ్ 2023 సాగుకు సంబంధించి విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఎఒ భారతి తెలిపారు. గురువారం నుండి రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రం సిబ్బంది వద్ద వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. డబ్బును కూడా వెంటనే జమ చేయాలన్నారు. రైతులు తమ వెంట ఆధార్ కార్డు, పట్టాదారు పాసు బుక్కు, సెల్ ఫోన్ తప్పక తీసుకొని వెళ్ళాలన్నారు. పట్టాదారు పాస్ బుక్కు ఉన్న రైతు తప్పని సరిగా వేలి ముద్ర వేయాలని అన్నారు.

బత్తలపల్లి : ఖరీఫ్ సీజన్లో వేరుశనగ పంట సాగు చేయదలచిన రైతులు విత్తన వేరుశనగకోసం గురువారం నుంచి ఆయా రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తున్నట్లు ఎఒ ఓబిరెడ్డి తెలిపారు. విత్తన వేరుశనగ కాయలు కావలసిన రైతులు ఆదార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం(1బీ), జిరాక్స్ కాపీలతోపాటు మొబైల్ ఫోన్ తీసుకుని రావాలని ఆయన తెలిపారు.

గాండ్లపెంట : సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాలో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎఒ లక్ష్మీ ప్రియ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పట్టాదారు పాసుబుక్కు, ఆధార్ కార్డు, ఫోన్ వెంట తీసుకుని రావాలన్నారు.

కొత్తచెరువు : సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు గురువారం నుండి ఆయా ఆర్ బి కె కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ నటరాజు తెలిపారు ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో విత్తన కాయలు పంపిణీ చేస్తోందన్నారు. కావలసిన రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ మొబైల్ ఫోను తీసుకొని ఆర్బికేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.